క్లుప్తంగా

అన్నదానం

రౌతులపూడి: శృంగవరం–మెరక చామవరం సమీపంలోని నందనవనం నాగలింగేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం అన్నదానం నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంట కాలువలో పూడిక తొలగించాలని వినతి



ఏలేశ్వరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగించాలని రైతులు కోరారు. ఈ మేరకు స్థానిక నగర పంచాయతీ కమిషనర్ కొండలరావు, తహసీల్దార్ చిన్నారావులకు విడివిడిగా సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల అక్రమణల తొలగింపులో భాగంగా అధికారులు పంటకాలువపై నిర్మాణాలు తొలగించారన్నారు. కాలువలో భవన నిర్మాణ వ్యర్థాలు పడి పూడిక పేరుకుపోయిందన్నారు. దీంతో దిగువ ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువలో పూడిక తొలగించాలని కోరారు. రైతులు సామంతుల కృష్ణకిషోర్, ఆకుల గంగరాజు, పైల రామన్న, సామంతుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులకు శ్రీకారం

తుని రూరల్: గ్రామీణులకు సైతం రక్షిత తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్టు రాజుపేట సర్పంచ్ బుద్దాల సత్తిబాబు తెలిపారు. రాజుపేటలో జల్‌జీవన్ మిషన్ పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో ప్రధాన పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలోని అన్ని ఇళ్లతో పాటు జగనన్న కాలనీలో ఇళ్లకు కూడా రక్షిత తాగునీరు అందిస్తామని తెలిపారు.

గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



బొద్దవరంలో సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి ఇందిరాప్రియదర్శిని

కోటనందూరు: మండలపరిధిలోని గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని తెలిపారు. సోమవారం బొద్దవరంలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 12,696 కుటుంబాల్లో సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తామన్నారు. 50 టీములు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తాయన్నారు. గుర్తించిన వ్యాధి గ్రస్తులకు వ్యాధి తీవ్రతను బట్టి 6 నెలలు, సంవత్సరం కోర్సు మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. జూలై 17 వరకూ ఈ సర్వే జరుగుతుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ అప్పారావు, ఎంపీహెచ్‌ఏ రమేష్‌నాయుడు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

తుని: ఎన్నికలకు ముందు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం వద్ద జీపు జాత ప్రచార కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల జిల్లా కార్యదర్శి చంద్రావతి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణ కంటె రూ.1000 జీతం అదనంగా ఇస్తామన్న హామీ నాలుగు సంవత్సరాలు గడిచినా అమలు కాలేదన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ సిబ్బందికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రమాప్రభ, చామంతి, విజయశాంతి, రమణమ్మ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

గోకవరం: మనబడి నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం పీఎంసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పీఎంసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, హెచ్‌ఎం పల్లాల సత్యనారాయణరెడ్డి, నాయకులు నరాలశెట్టి నర్శయ్య పాల్గొన్నారు.

నాడు తడబడి.. నేడు నిలబడి

- విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు
- రూ.40 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన



నాడు: పంట కాలువలో ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్న కోటనందూరు హైస్కూల్ విద్యార్థులు



నేడు: సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన భీమవరపుకోట హైస్కూల్

కోటనందూరు: ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. మనబడి నాడు–నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారు. బోధనా విధానంతో పాటు మౌలిక వసతుల కల్పనలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితంగా చెట్ల కింద కూర్చొని చదవడం, ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడం, పంటకాలువల్లో భోజనం ప్లేట్లు శుభ్రపరుచుకోవడం వంటి దయనీయ పరిస్థితులకు చరమగీతం పాడారు. తల్లిదండ్రులకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్నామనే భావనను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కల్పించారు. ప్రస్తుతం పల్లెల్లో ప్రభుత్వ బడులు సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి.

కార్పొరేట్‌కు దీటుగా...

కోటనందూరు మండలంలో ఆరు హైస్కూళ్లు, నాలుగు యూపీ, 21 ఎంపీపీ, కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. మనబడి నాడు–నేడులో భాగంగా తొలి విడతలో 18 పాఠశాలలను రూ.22.5 కోట్లు, రెండో విడతలో 17 పాఠశాలలను రూ. 20 కోట్లతో అభివృద్ధి చేశారు. అవసరానికి మించి తరగతి గదులు, గోడలపై ఆశక్తి కలిగించే బొమ్మలతో పాటు విశాల క్రీడా ప్రాంగణాలు, ప్రహరీలు ఏర్పాటు చేసి పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో హైస్కూళ్ల విద్యార్థులు సగానికి పైగా, కొన్ని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద కూర్చుని చదువుకునేవారు. కనీసం మంచినీరు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి నీళ్లుతాగడం, పంట కాలువల్లో ప్లేట్లు శుభ్రం చేసుకోవడం కనిపించేవి. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో గత పరిస్థితులన్నీ కనుమరుగైపోయాయి. తరగతి గదిలో దర్జాగా ఫ్యాన్ల కింద కూర్చొని ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు నేర్చుకుంటున్నారు. ఆర్వో ప్లాంట్లలో నీటిని తాగుతూ కార్పొరేట్ తరహా టాయిలెట్లలో కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి.

చరిత్రలో గుర్తుండిపోయేలా మార్పులు



చరిత్రలో గుర్తుండిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఇప్పుడు బడులు సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. పుస్తకాలు, యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఇలా అన్ని విషయాల్లో సమూల మార్పులు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. ఈ పరిణామం విద్యార్థుల ఉత్తమ భవిష్యత్‌కు నాంది. సీఎం జగన్ విద్యావ్యవస్థపై చూపుతున్న శ్రద్ధ అభినందనీయం.

– లెక్కల స్వామినాయుడు, రిటైర్డు ఎంఈఓ, జగన్నాథపురం

తాండవ గ్రోయిన్లకు శాశ్వత మరమ్మతులు



రాష్ట్రస్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశంలో మాట్లాడుతున్న లంక ప్రసాద్

కోటనందూరు: శిథిలావస్థకు చేరిన తాండవ గ్రోయిన్లకు శాశ్వత మరమ్మతులు చేయాలని వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో వరద ఉధృతికి తాండవ నదిపై గ్రోయిన్ల కొట్టుకుపోయాయన్నారు. ఏటా తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం ఉండడం లేదని, రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. తాండవ పంట కాలువలను సైతం అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

నోటీసులిచ్చిన తర్వాతే సర్వే చేయాలి



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న చింతలూరు ఈనాం భూముల సాగుదారులు

ప్రత్తిపాడు: చింతలూరులో ఈనాం భూమిని సాగు చేస్తున్న రైతులకు నోటీసులు ఇచ్చిన తర్వాతే భూముల సర్వే చేపట్టాలని కోరుతూ చింతలూరు రైత్వారీ హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్తిపాడులో ఆందోళన నిర్వహించారు. రైత్వారీ హక్కుల సాధన కమిటీ కన్వీనర్ తాడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ శేనాపతి రాజు, మాజీ సర్పంచ్ జంకల ఫకీరు, బూరా సత్తిబాబు ఆధ్వర్యంలో ఈనాం భూమి సాగుదారులు స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయం నుంచి నంది సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేసి అక్కడ ధర్నా చేపట్టారు. ఈనాం భూముల సాగుదారుల నుంచి పన్నులు వసూలు చేయడం లేదని, భూములకు హక్కులు కల్పించడం లేదని ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, చింతలూరు గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు కూనిశెట్టి రాజన్నబాబు, సాగుదారులు గదుల కామరాజు, తూము చెల్లబాబు, జంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ధర్మవరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సొసైటీ చైర్మన్ చెక్కపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల బాబులు, నానిపల్లి చంటి తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. తొలుత జగనన్న సురక్ష కార్యక్రమం కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు శేరు కృష్ణ, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల చినబాబు, పార్టీ నాయకులు బొల్లు తాతాజీ, కుప్పిన శ్రీను, రాపా గుర్రాజు, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రత్తిపాడు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు అమ్మేవారు విద్యార్థులనే టార్గెట్ చేస్తుంటారన్నారు. ఆకర్షణీయమైన మాయ మాటలు చెప్పి మత్తుకు అలవాటు చేస్తారని, వారి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కాకూడదని, క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ప్యానల్ అడ్వకేట్ బుగత శివ, బార్ ప్రతినిధి ఏకేఎస్ మల్లేశ్వరరావు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్‌కు వ్యతిరేకంగా ర్యాలీ

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్తిపాడులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఎస్సై బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

కిర్లంపూడి: యువత మాదక ద్రవాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై టి.రఘునాథరావు సూచించారు. జగపతినగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు.

రౌతులపూడి: గంజాయి, క్రొకైన్ వంటి డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని కోటనందూరు ఎస్సై పి.స్వామినాయుడు సూచించారు. రౌతులపూడిలో సూర్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

తుని: జీవితాన్ని సర్వనాశనం చేసే మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ నాగదుర్గారావు సూచించారు. స్థానిక కొండవారిపేటలో సోమవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, దొంగతనాల భారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రోడ్డు భద్రతను ప్రతీఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రజలు స్నేహభావంతో మెలగాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వీర్రాజు

తుని: స్థానిక శ్రీప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో సోమవారం వసుధ ఫార్మా కెమికల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి ఫైనల్ ఇయర్ బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చదువుతున్న 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. అభ్యర్థులకు వసుధ ఫార్మా సంస్థ డిప్యూటీ మేనేజర్, హెచ్‌ఆర్ పి.శ్రీహర్షవర్మ పర్యవేక్షణలో రాత పరీక్ష నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు హెచ్‌ఆర్ సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించి 50 మందిని ఎంపిక చేశారు. వీరంతా వసుధ ఫార్మా లిమిటెడ్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అనాలసిస్, ప్రొడక్షన్ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వసుధ ఫార్మా కంపెనీ ప్రతినిధులు వి.శ్రీరామమూర్తి, టి.గణేష్ పుత్రకుమార్, ఎం.ప్రకాష్, డి.వర్మరాజు, లక్ష్మీ నారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు తదితరులు అభినందించారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేయాలి

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పథకం ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యాన ఆఫీసర్ నేతల మల్లికార్జునరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, వలంటీర్లతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జూలై ఒకటి నుంచి 28 వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అర్హులకు పది రకాల ధ్రువపత్రాలు అందించాలన్నారు. అందుకు అర్హులను ఇప్పటి నుంచే గుర్తించాలని సూచించారు. ఎంపీడీఓ విజయకుమార్, ఏఓ శేషగిరిరావు, హెచ్‌ఓ జి.విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ జయరామ్, డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రోటరీక్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారాలు



విజయనగరంలో అవార్డులు అందుకుంటున్న తుని రోటరీక్లబ్ సభ్యులు

తుని: స్థానిక రోటరీక్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. విజయనగరంలో సోమవారం అత్యుత్తమ సేవాకార్యక్రమాలు నిర్వహించిన రోటరీ క్లబ్‌లకు బహుమతి ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. కాకినాడ జిల్లాలో అత్యుత్తమ సేవా కార్యక్రమాలు చేసిన తుని రోటరీ క్లబ్‌కు గోల్డ్, సిల్వర్, ప్లాటినం విభాగాల్లో ఐదు అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను గవర్నర్ భాస్కర్‌రామ్ చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షుడు నెరైల సతీష్, క్లబ్ సభ్యులు అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ సురేష్, వివేకానంద, నర్సిబాబు, సత్యసాయి, పెనుముచ్చు కృష్ణ, గౌరీశంకర్, మోహన్‌కృష్ణ, ఎస్ఎస్ భూషణం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో దళితులకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఏడుకొండలు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులకు సముచిత స్థానం లభిస్తోందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జిగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, రీజినల్ కోఆర్డినేటర్లు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ వంగా గీత, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షులు కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజాలకు కృతజ్ఞతలు తెలిపారు. జోన్‌లోని ఐదు జిల్లాల్లో పార్టీ దళిత విభాగాలను సమన్వయం చేసుకుని రానున్న ఎన్నికల్లో పార్టీ తిరిగి అధికారం చేపట్టడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో దళిత నాయకులు మచ్చా మోహన్, గునిపే ఏడుకొండలు, ఇజ్జిన కిరణ్ కుమార్, కూరాకుల సుమంగళి, మడతల రమేష్, గోలి చిన్ని, పత్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు డయల్ యువర్ డీఎం

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు, వారి సలహాలు తీసుకోవడానికి ఆ రోజు సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 99592 25533 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.

30న మండల సమావేశం

శంఖవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శివరామకృష్ణ తెలిపారు. ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును సోమవారం జడ్జి కాటం భాను ప్రారంభించారు. ఈ ఆర్వో ప్లాంట్‌ను సీనియర్ న్యాయవాది రమణం వీర వెంకట రమణారావు సమకూర్చారు. కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టంశెట్టి పుల్లయ్య, బి.మధుబాబు, ప్రతినిధులు మళ్ల గంగాధర్, లింగంపల్లి శివకుమార్, అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి పనుల పరిశీలన

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో నాడు–నేడు పథకంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిని పూర్తి చేయాలని ఏపీఎం ఐడీసీ ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం సూచించారు. రౌతులపూడి సీహెచ్‌సీలో నాడు–నేడు నిధులు రూ.6.99 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్, ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈ చక్రవర్తి, జేఈ శేషగిరి తదితరులు ఉన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

ప్రత్తిపాడు: గంజాయి కేసులో ప్రధాన నిందితుడిని సోమవారం ప్రత్తిపాడు ఇన్‌చార్జి, జగ్గంపేట సీఐ బి.సూరిఅప్పారావు అరెస్టు చేశారు. 2022లో ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పట్టుబడిన గంజాయి కేసులో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన షేక్ అహ్మద్ ప్రధాన నిందితుడు. అతడిని అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా, జడ్జి కాటం భాను రిమాండ్ విధించారు. నిందితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు సీఐ సూరి అప్పారావు తెలిపారు.

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: మండలంలోని మామిడాడ గ్రామ శివారులో సారా తయారీ కేంద్రాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. పది లీటర్ల సారాతో దెయ్యాల వీరరాఘవులును అరెస్టు చేసినట్లు చెప్పారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

ఏలేశ్వరం: ఆక్రమణల తొలగింపులో నష్టపోయిన తమకు న్యాయం చేయాలంటూ స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం దుకాణదారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణల సమయంలో తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చిందన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కొండలరావుకు వినతిపత్రం అందజేశారు. అలమండ నాగేంద్ర కుమార్, గూడవల్లి గోవిందరావు, ఉద్దగిరి సత్యనారాయణ, వాగు రవిశంకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ప్రత్తిపాడు: చినశంకర్లపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి వివేకానంద సేవా సమితి ట్రస్ట్ చేయూతను అందించింది. బాధిత కుటుంబానికి వివేకానంద సేవా సమితి ట్రస్ట్ నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, కిరాణా సామగ్రి, కొంత నగదును సమకూర్చింది. వీటిని సోమవారం ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్లపల్లి అమలావతి, షేక్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో..

గోకవరం: స్థానిక కుమ్మరిపేటలో వర్షానికి తాటాకిల్లు నేలకూలి నిరాశ్రయులైన కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు చేయూతనందించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ బాధితురాలు నీలిమ లక్ష్మికి బియ్యం, కందిపప్పు అందించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలివ్వాలంటూ ఆందోళన

జగ్గంపేట: పేదలు 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు మాట్లాడుతూ మండలంలోని గుర్రంపాలెంలో సర్వే నంబర్ 270/2ఏలో 10ఎకరాల భూమిని రెండు దశాబ్దాలుగా గ్రామానికి చెందిన నిరు పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ఇదే సర్వే నంబర్లో సుమారు నాలుగు ఎకరాలు భూమికి సర్వే నంబర్లు మార్చివేసి తప్పుడు రికార్డులు సృష్టించారని ఆరోపించారు. మిగిలిన భూమిని కొంతమంది పెద్దలు కాజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి డి.సురేష్, దాన్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఇంటికే పౌష్టికాహారం

శంఖవరం: గర్భిణులు, బాలింతలకు జూలై 1 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటి వద్దకే పౌష్టికాహారం అందజేస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బాలింతలు, గర్భిణులకు భోజనం పెట్టేవారన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేసేందుకు ఇబ్బంది పడుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇక నుంచి ఒక్కొక్కరికి నెలకు 3 కిలోల బియ్యం, 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, కిలో కంది పప్పు, 250 గ్రాముల ఖర్జూరం, 500 గ్రాముల నూనె, చిక్కీలు, బెల్లం ఇంటికే అందజేస్తామని వివరించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట టీడీపీ విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టో ప్రచారంలో భాగంగా త్వరలో చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ కోరారు. మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బస్సుయాత్ర షెడ్యూల్, పర్యవేక్షణ, సభా స్థలం, పల్లెనిద్ర, వర్గ సమావేశం తదితర అంశాలపై చర్చించారు.